క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు అంచనాలు

అద్దంకి: మండలంలోని తిమ్మాయపాలెం గ్రామంలోని ఎత్తిపోతల పథకాన్ని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి ఆదేశాల మేరకు శనివారం ఎలక్ట్రికల్ డీఈ పరిశీలించారు. దానిలో భాగంగా ఎత్తిపోతల పథక మోటార్లకు అవసరమైన నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు ఎస్టిమేషన్ తయారు చేశారు.

సస్యరక్షణ చర్యలతో లాభం



సదస్సులో మాట్లాడుతున్న డీడీఏ విజయ నిర్మల

చినగంజాం: రైతులు వరి పంటలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని బాపట్ల జిల్లా వనరుల కేంద్రం డీడీఏ విజయనిర్మల సూచించారు. శనివారం బాపట్ల ఆత్మ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన శిక్షణ నిర్వహించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు చేయాలన్నారు. జిల్లా అడిషనల్ డీపీఎం జె. మోహన్ మాట్లాడుతూ రైతులు నేల ఆరోగ్యం కాపాడేందుకు ప్రకృతి వ్యవసాయం ఒక్కటే మార్గమని సూచించారు. ఏఓ కె. భాస్కరరావు, మాజీ జెడ్పీటీసీ యార్లగడ్డ లక్ష్మి, గ్రామ వ్యవసాయ సహాయకులు, వ్యవసాయ విస్తరణాధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెటీరియల్ అందజేత



మాట్లాడుతున్న ఫెడరేషన్ సభ్యులు

పర్చూరు (చినగంజాం): పర్చూరు కేంద్రంగా కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ ఏర్పాటు చేసినట్లు సభ్యులు కొండ్రగుంట శివ తెలిపారు. శుక్రవారం సంస్థ నూతనంగా ఏర్పడిన సందర్భంగా నాగులపాలెంలోని నాగుబడి రంగయ్య బధిరుల పాఠశాలలో 10 వ తరగతి విద్యార్థులకు పరీక్షకు మెటీరియల్ ఉచితంగా అందజేశారు. విద్యార్థులు బాగా చదువుకొని అభివృద్ధిలోకి రావాలని సంస్థ ప్రతినిధులు కోరారు. ఫెడరేషన్ సభ్యులు గడ్డిపాటి శ్రీనివాసరావు, కొల్లా రాజ,మాల్లాది సురేష్, కొల్లా చౌదరి, కోట శ్రీనివాసరావు, కోట వీరప్రసాద్, కొల్లా సుబ్బారావు, నార్నే చంద్రశేఖర్, బత్తుల సాంబశివరావు పాల్గొన్నారు.

డిజిటల్ క్లాస్ ప్రారంభం



డిజిటల్ క్లాస్ రూం వినియోగించుకుంటున్న విద్యార్థులు

జె.పంగులూరు: డిజిటల్ క్లాసురూముల ద్వారా విద్యార్థులు వారి విద్యాస్థాయి పెంచుకోవచ్చని మాగుంట సుబ్బరామిరెడ్డి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మేకల ఉషారాణి అన్నారు. మండల పరిధిలోని పంగులూరు మాగుంట సుబ్బరామి రెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో శనివారం డిజిటల్ క్లాసురూంను పంగులూరు రోటరీ క్లబ్ సభ్యులు, వాల్ స్క్రీన్‌ను తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్ ప్రారంభించారు. ప్రిన్సిపాల్ మేకల ఉషారాణి మాట్లాడుతూ రూ. 50 వేలు విలువగల ప్రొజెక్టర్, వాల్ స్క్రీన్, ట్రాలీ స్పీకర్‌ను అంతర్జాతీయ ఖోఖో క్రీడాకారుడు, కేంద్ర పోస్టల్ అసిస్టెంట్ ఆఫీసర్ పోతిన శివారెడ్డి అందించారని తెలిపారు. ఈ సందర్భంగా దాతకు కృతజ్ఞతలు తెలిపారు. కళాశాలలోని ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో శిక్షణ తీసుకొని అంతర్జాతీయ స్థాయికి ఎదిగి తోటి విద్యార్థులకు క్రీడాకారులకు తోడ్పాటునందించటం ఎంతో సంతోషంగా ఉందని కళాశాల పీడీ ఖోఖో కోచ్ మేకల సీతారామిరెడ్డి తెలిపారు. సర్పంచ్ గుడిపూడి నాగేంద్ర రామారావు, జెడ్పీటీసీ సభ్యులు రాయిణి ప్రమీల వెంకటసుబ్బారావు పాల్గొన్నారు.

వృద్ధునికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన దానియేలు

మార్టూరు: స్థానిక జాతీయ రహదారిపై శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు తీవ్రంగా గాయపడిన సంఘటన జొన్న తాళి సమీపంలో జరిగింది. ఇసుక దర్శి గ్రామానికి చెందిన పసుమర్తి దానియేలు జొన్న తాళి గ్రామంలోని తన కుమార్తె ఇంటికి వెళ్లడం కోసం రహదారి దాటుతున్నాడు. ఈ క్రమంలో ఓ బొలెరో కారు చిలకలూరిపేట వైపు వెళుతూ రోడ్డు దాటుతున్న దానియేలును వేగంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు రోడ్డుపై పడిన దానియేలు కుడికాలు విరిగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. సమాచారం అందుకున్న హైవే అంబులెన్స్ సిబ్బంది మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి.. పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఏఎస్ఐ మహబూబ్ బాషా తెలిపారు.



ఉన్మాదులను కఠినంగా శిక్షించాలి

మహిళా వైద్యురాలిపై దాడి చేసి అతి క్రూరంగా లైంగిక దాడితో పాటు, ప్రాణాలను తీసిన ఉన్మాదులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలి. సంఘటన జరిగిన వెంటనే ఫాస్ట్రాక్ కోర్టుల ద్వారా వారిని కఠినంగా శిక్షలను అమలు చేయాలి. అప్పుడే మరొకరు ఇలాంటి ఘాతుకాలకు ఒడిగట్టకుండా ఉంటారు. ప్రభుత్వాలు నైట్ డ్యూటీలు చేసే వైద్యులు, మహిళా వైద్య సిబ్బందికి రక్షణగా ఉండాలి. వారికి అవసరమైన భద్రత ఏర్పాటు చెయ్యాలి.

– పి. క్షీరవర్ధిని, స్టాఫ్‌నర్స్, స్వర్ణ పీహెచ్‌సీ





ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వ ఆసుపత్రులు, పీహెచ్‌సీల్లో నైట్ డ్యూటీ మహిళా డాక్టర్లు, మహిళా నర్సులకు రక్షణ లేకుండా పోతోంది. రాత్రి సమయాల్లో ఎవరు, ఎలాంటి అవసరాల కోసం వస్తుంటారో అని వైద్యులు, సిబ్బంది వెళుతుంటాము. కానీ వచ్చేవారు దాడులకు పాల్పడితే మాకు రక్షణ ఎక్కడుంటుంది. ప్రభుత్వం గ్రామీణ, పట్టణ వైద్యశాలల్లో గట్టి భద్రత చర్యలు చేపట్టాలి.

– ఎల్. మల్లీశ్వరి, స్టాఫ్‌నర్స్, స్వర్ణ పీహెచ్‌సీ

కూటమి చర్యలతో షాక్

- చీరాల సెబ్ పరిధిలో 42 ప్రభుత్వ మద్యం దుకాణాలు
- వీటిలో 168 మంది దాకా ఉద్యోగులు
- అగమ్యగోచరంగా మద్యం షాపుల్లో ఉద్యోగుల పరిస్థితి
- ఇప్పటికే వేతనాలు అందక అవస్థలు
- నూతన పాలసీ వస్తే కష్టాలే..



ప్రభుత్వ మద్యం దుకాణం

వేటపాలెం: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే సిబ్బంది కొత్తపాలసీ రాగానే వారి ఉద్యోగాలు ఊడినట్టే కనిపిస్తోంది. చీరాల సెబ్ పరిధిలో 42 దుకాణాలను గత ప్రభుత్వంలో ఏర్పాటు చేశారు. బడుగు బలహీనులు ఎక్కువగా ఉండే చీరాల ప్రాంతంలో పలువురు నిరుద్యోగులు ఈ దుకాణాల ద్వారా ఉపాధి పొందుతున్నారు. కానీ దీనిపై రాద్ధాంతం చేసిన టీడీపీ.. నేటి కూటమి హయాంలో నూతన మద్యం పాలసీని సెప్టెంబర్ నుంచి అమలు చేస్తామని ప్రకటించింది. దీంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ప్రతి నెలా మొదటి వారంలో అందాల్సిన జీతాలు ఇప్పటివరకూ అందడంలేదు. చీరాల టౌన్‌లో ప్రతి దుకాణానికి ఓ సూపర్ వైజర్, ముగ్గురు సేల్స్ మెన్లు, ఒక వాచ్‌మన్, అదే మండలాల్లో ఓ సూపర్‌వైజర్, ఇద్దరు సేల్స్‌మెన్లు, ఒక వాచ్‌మన్ ఉన్నారు. ఆలెక్కన 42 దుకాణాల్లో 168 మంది దాకా ఉద్యోగులున్నట్లే. వీరిలో సూపర్‌వైజర్‌కు నెలకు రూ. 19 వేలు, సేల్స్‌మెన్లకు రూ.16,500, వాచ్ మన్లకు రూ. 12 వేలు జీతం ఇస్తున్నారు. గతంలో ప్రతి నెలా మొదటి వారంలో జీతాలు అందేవి. ప్రస్తుతం ఈ నెల 18వ తేదీ నాటికి కూడా జీతాలు క్రెడిట్ కాలేదు.

టీడీపీ పాలనలో..

2019కి ముందు ఉన్న మద్యం దుకాణాలకు ప్రతి రెండేళ్లకోసారి టెండర్లు పిలిచేవారు. లాటరీ ద్వారా దుకాణాలు కేటాయించేవారు. మహిళలు సైతం టెండర్లలో పాల్గొనేవారు. కొన్ని ముఖ్యమైన మద్యం దుకాణాలకు డిమాండ్ ఉండేది. అవన్నీ రాజకీయ నాయకుల అజమాయిషీలోనే నడిచేవి. ప్రైవేట్ దోపిడీని అరికట్టేందుకు 2019 లో అధికారం లోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రభుత్వ దుకాణాలకు శ్రీకారం చుట్టింది. అవినీతి అక్రమాలకు చెక్ పెట్టింది.

గత ప్రభుత్వ పాలనలో ఉపాధి

గత ప్రభుత్వం ప్రభుత్వ మద్యం షాపులతో పలువురు నిరుద్యోగులకు ఉపాధితో జీవితాన్నిచ్చింది. దాదాపు ఐదేళ్ల పాటు ఎలాంటి కష్టం లేకుండా వారు ప్రభుత్వ దుకాణాల్లో పనిచేశారు. కుటుంబాలను పోషించేవారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీతో వీరి ఉద్యోగాలు ప్రశ్నార్థకమయ్యాయి.

కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీ కారణంగా ప్రైవేట్ ఏజెన్సీలు మద్యం షాపులను నిర్వహించే పరిస్థితి కనిపిస్తోంది. దీనికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ సైతం కొనసాగనుంది. మద్యం పాలసీతో అంతిమంగా లబ్ధి పొందేది కాంట్రాక్టర్లు, టీడీపీ నేతలే. ఇక ప్రభుత్వం మద్యం షాపుల సిబ్బందిని కొనసాగిస్తారా లేక తొలగిస్తారా? అనే విషయంపై సందిగ్ధ నెలకొంది. అయితే తాము ఆందోళన బాట పట్టక తప్పదని ఉద్యోగులు చెబుతున్నారు.

చమత్కార శబ్దార్థ గారడీయే అవధానం



అవధానం చేస్తున్న నారాయణం బాలసుబ్రహ్మణ్యం

అద్దంకి: శతావధాన కార్యక్రమం సాహితవేత్తలను, సాహిత్య ప్రియులను ఆకట్టుకుంది. స్థానిక చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ గార్ల సేవాసదన్‌లో శతావధాని నారాయణం బాలసుబ్రహ్మణ్యం శతావధాన కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ అష్టావధాన కార్యక్రమాన్ని సాహితీ మిత్ర మండలి, పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మ చారిటబుల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మొదటి రోజు సభలో సాహితీ కుసుమలు విరబూశాయి. ఈ కార్యక్రమం లక్కరాజు చంద్రశేఖర్ అధ్యక్షతన ప్రారంభించారు. ముందుగా ప్రముఖ సాహితవేత్త గాడేపల్లి దివాకర దత్తు ప్రారంభోపన్యాసం చేస్తూ కొప్పురపు కవుల ఆశుకవితా వైభవాన్ని సభకు పరిచయం చేశారు. కొప్పరపు కవులు ఒక గంటలో ఆశువుగా 720 పద్యాలు.. అరగంటలో 360 పద్యాలలో మను చరిత్ర మరిచించిన విషయాన్ని చెప్పారు. 'చమత్కార శబ్దార్థముల గారడినే అవధానం' అని ఆధ్యాత్మిక గ్రంథ రచయిత, శతావధాన సంచాలకులు పోలూరి వేంకట శివరామ ప్రసాదరావు అన్నారు. కవితల పుట్టిల్లు కొప్పరపు వారిల్లని, అద్దంకి సీమలోని బల్లికురవ దగ్గర కొప్పరం కవుల నివాసమని, పద్యం పాత బడలేదనడానికి సాక్ష్యం అవధానమని శతావధాన నిర్వాహకుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి అన్నారు. వివిధ జిల్లాలుకు చెందిన 25 మంది పృచ్ఛకులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో చుండూరి మురళీసుధాకరరావు, కూకట్ల సుబ్బారావు, డీవీఎం సత్యనారాయణ, డాక్టర్ యు.దేవపాలన, చిన్నిమురళీకృష్ణ, చప్పిడి వీరయ్య, లక్కరాజు శ్రీనివాసరావు, బి.పురుషోత్తం, దుర్భాకొండిన శాయి, యం. కృష్ణ కిశోర్, బంధా వేంకట కృష్ణ శక్తిధర్, పట్టణ వాసులు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ రహిత సమాజానికి కృషి



యద్దనపూడి: హెచ్ఐవీ పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



కుంకలమర్రులో అవగాహన కల్పిస్తున్న ప్రాజెక్టు సిబ్బంది

యద్దనపూడి: హెచ్ఐవీ రహిత సమాజ స్థాపనకు అంతా కృషి చేయాలని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ స్థానిక లింక్ వర్కర్ నాగమల్లేశ్వరి అన్నారు. శనివారం పూనూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ , జిల్లా ఎయిడ్స్ నివారణ సంస్థ ఆధ్వర్యంలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్‌స్కీమ్ సారథ్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం ఏఎమ్ శ్రీనివాసరావు, ఏఎన్ఎమ్‌లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కుంకలమర్రు (కారంచేడు): హెచ్ఐవీ వైరస్ ద్వారా వ్యాపించే ఎయిడ్స్ వ్యాధి అంటు వ్యాధి కాదని, అది అంటించుకొనే వ్యాధి అని ప్రాజెక్టు మేనేజర్ ఏ. శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం కుంకలమర్రు ఉన్నత పాఠశాల ఆవరణలో 8,9,10 తరగతుల విద్యార్థులకు హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీ స్టేట్ ఎయిడ్స్ నియంత్రణ మండలి, చీరాల మహిళా మండలి టీఐ ప్రాజెక్టుల సంయుక్త ఆధ్వర్యంలో వ్యాధి వ్యాప్తి ఎలా జరుగుతుందో వివరించారు. మహిళా మండలి వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ మంత్రి జాగర్లమూడి లక్ష్మీపద్మావతి ఆదేశాలతో టీఐ ప్రాజెక్టు పీడీ శ్రీనివాసరెడ్డిల సహకారంతో అవగాహన కల్పిస్తున్నామన్నారు. హైస్కూల్ హెచ్ఎం కె. పద్మావతి, విజయబాబు, లలిత, దానమ్మ, సంధ్య, జ్యోతి, శ్రీగీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: హెచ్ఐవీ/ఎయిడ్స్ నిర్మూలనకు కృషి చేయాలని అద్దంకి ఎంపీపీ అవిశెన జ్యోతి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బాపట్ల జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మీకు తెలసా ఐఈసీహెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్ప్ స్వచ్ఛంద ప్రాజెక్టు డైరెక్టర్ సాగర్ హెచ్ఐవీ/ ఎయిడ్స్ నిర్మూలనకు ఆ వ్యాధి ఏవిధంగా సోకతుందో గోడపత్రికలను ఆవిష్కరించారు. ఎంపీడీవో దేవసేనకుమారి, సర్పంచ్‌లు అధికారులు పాల్గొన్నారు.

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు



గడియార స్తంభం సెంటర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

అద్దంకి రూరల్: కోల్‌కతాలోని జూనియర్ డాక్టర్‌పై లైంగికి దాడి జరిపి హత్యకు పాల్పడ్డ నిందితులను వెంటనే కఠినంగా శిక్షించాలని ప్రజారోగ్య వేదిక జిల్లా అధ్యక్షుడు కావూరి రఘు చంద్ అన్నారు. శనివారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అద్దంకి పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు అధ్యక్షత వహించారు. దీనిలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. బంగ్లారోడ్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక నాయకుడు డాక్టర్ వై. హనుమంతరావు మాట్లాడుతూ కోల్‌కతా నిందితులను కాపాడుతున్న నాయకులంతా దేశ ద్రోహులేనన్నారు. దోషులను కఠినంగా శిక్షించేవరకు ప్రజాసంఘాలు పోరాటాలు చేస్తూనే ఉంటాయని తెలిపారు. గవర్నమెంటు జూనియర్ కళాశాల అధ్యాపకురాలు పద్మావతి మాట్లాడుతూ మహిళలకు సమాజంలో రక్షణ కరువైందన్నారు. దేశాభివృద్ధి గురించి మాట్లాడే ప్రతి నాయకుడు ముందు మహిళల రక్షణ గురించి మాట్లాడలన్నారు. అనంతరం మహిళలు, ప్రజాసంఘాల నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు.

చీరాల అర్బన్: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌ని హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అలానే స్థానిక గడియార స్తంభం సెంటర్లో నిరసన తెలిపారు. హత్య కేసులో ఉన్న దోషులను కఠినంగా శిక్షించాలని, హత్యకు గురైన మౌమితకు న్యాయం జరగాలని డిమాండ్ చేశారు.

ఎస్‌బీఐలో అధిక వడ్డీ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న తహసీల్దార్, ఎస్‌బీఐ అధికారులు

అద్దంకి రూరల్: స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో నగదును డిపాజిట్ చేస్తే అధిక వడ్డీ పొందవచ్చని ఎస్‌బీఐ అద్దంకి మెయిన్ బ్రాంచ్ డిప్యూటీ మేనేజర్ పి. వసంత్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద డిపాజిట్, వివిధ రకాల పొదుపులపై, నూతన ఖాతాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా తహసీల్దార్ శ్రీచరణ్ అమృత్ వర్షిత్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. డిప్యూటీ మేనేజర్ మాట్లాడుతూ అమృత్ వర్షిత్‌లో డిపాజిట్ చేస్తే 444 రోజుల్లో 7.25 శాతం వడ్డీ పొందవచ్చన్నారు. అలాగే ఇదే స్కీమ్‌లో సీనియర్ సిటిజన్స్ 7.75 శాతం వడ్డీ పొందవచ్చని తెలిపారు. మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడిపెట్టి అధిక శాతంలో లాభాలు పొందవచ్చని వివరించారు. గృహ రుణాలు, బంగారు రుణాలు తక్కువ వడ్డీకి ఇస్తున్నట్లు తెలిపారు. ఎస్‌బీఐ సేవలు వినియోగించుకుని కస్టమర్లు మంచి భవిష్యత్ పొందాలన్నారు. అద్దంకి ఎస్‌బీ శాఖ మేనేజర్ అనిల్ కుమార్, మెయిన్‌బ్రాంచ్ అధికారులు కిరణ్ కుమార్, కె. నరసింహారావు, ఎన్. సుబ్బారావు, ఆంజనేయులు, రవి, సతీష్ పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

చినగంజాం: మండలంలోని మున్నం వారిపాలెం పంచాయతీ పరిధిలోని ఎంఎస్ఆర్ జూనియర్ కాలేజీ ఆవరణలో పేకాట ఆడుతున్న 5 గురిని శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారంతో ఎస్ఐ ఎస్. రమేష్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని వారిని అదుపులోనికి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 1100 నగదు స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసిన వారిని కోర్టుకు హాజరు పరచనున్నట్లు తెలిపారు.

రెండు ఇంద్ర ఏసీ బస్సులు ప్రారంభం



ఇంద్ర ఏసీ బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల అర్బన్: ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. శనివారం చీరాల ఆర్టీసీ డిపోలో నూతనంగా వచ్చిన బీఎస్–6 రెండు ఇంద్ర ఏసీ సర్వీసులను ఆయన ప్రారంభించారు. నూతన బస్సులకు పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్టీసీ బలోపేతానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆర్టీసీ సర్వీసులు ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుస్తాయన్నారు. నూతన బస్సులను కొనుగోలు చేసి ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. డిపో మేనేజర్ జె.శ్యామల మాట్లాడుతూ గతంలో హైదరాబాద్‌కు బీఎస్–3 ఏసీ బస్సులు ఉన్నాయని, వాటి స్థానంలో బీఎస్–6 ఇంద్ర ఏసీ సర్వీసులు వచ్చాయన్నారు. కొత్త హంగులతో నూతన టెక్నాలజీతో ఏసీ బస్సులు వచ్చాయని తెలిపారు. ప్రయాణికులకు ఈ సర్వీసులు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయన్నారు. చీరాల డిపో నుంచి హైదరాబాద్, బెంగళూరుకు ఏసీ స్లీపర్ బస్సులను నడపాలని ప్రయాణికులు ఎమ్మెల్యేను కోరారు. ఆర్టీసీ అధికారులు, ఎన్ఎంయూ, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్త దానం చేస్తున్న అధ్యాపకులు

వేటపాలెం: ప్రమాదంలో ఉన్న వారికి రక్తం దానం చేయడం వల్ల వారికి ప్రాణదానం చేసిన వారమవుతామని ప్రిన్సిపాల్ కె. జగదీశ్‌బాబు పేర్కొన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఉచిత రక్తదాన శిబిరం శనివారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు స్వచ్ఛందంగా రక్త దానం చేయడానికి ముందుకు రావడాన్ని అభినందించారు. 110 మంది విద్యార్థులు రక్త దానం చేశారు. కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్. లక్ష్మణరావు, చీరాల ఏరియా వైద్యశాల బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి రాజా సెల్వన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డి. జ్యోతిస్వరూప్, కోర్డినేటర్లు పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో జీవితాలు నాశనం చేసుకోవద్దు



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జడ్జి షేక్ రెహాన

చీరాల రూరల్: యువత ప్రేమలో పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రెహాన హెచ్చరించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ చీరాల ఆధ్వర్యంలో శనివారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి పౌరులని పేర్కొన్నారు. విద్యార్థిని, విద్యార్థులు సోదరసోదరీల్లా ఉండాలని సూచించారు. ర్యాగింగ్‌కు పాల్పడినట్లయితే పోలీసు కేసులు నమోదు చేస్తారని చెప్పారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. టీవీలు, సెల్‌ఫోన్‌లు, ఇంటర్నెట్‌లకు అవలవాటపడవద్దని పేర్కొన్నారు. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ గురించి వివరించారు. చీరాల న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గౌరవ రమేష్‌బాబు, జీకే ఈశ్వరి రెడ్డి, న్యాయవాది వినీల, పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. కృష్ణమోహన్, పీఎల్‌వీ సాయికృష్ణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సహకరించండి



మాట్లాడుతున్న ఎంపీపీ

అద్దంకి రూరల్: గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి అధికారులు సహకరించాలని ఎంపీపీ అవిశెన జ్యోతి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పలు శాఖల అధికారులను సమస్యలపై వివరణ కోరారు. ఎంపీడీవో దేవసేన కుమారి, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

ఔషధ మొక్కలతో సంపూర్ణ ఆరోగ్యం

అద్దంకి రూరల్: నేటి సమాజంలో ఔషధ మొక్కలపై ప్రజలకు అవగాహన లేకపోవటంతో అనారోగ్యాల పాలవుతన్నారని, ప్రతి ఒక్కరూ చైతన్యంతో ఉండాలని ఐఈఈఆర్డీ సేవాసంస్థ అధ్యక్షుడు బి. కిరణ్‌చంద్ అన్నారు. శనివారం జాతీయ ఔషధ మొక్కల బోర్డు ఆయుష్ మంత్రిత్వ శాఖ సౌజన్యంతో, ఐఈఈఆర్డీ ఆధ్వర్యంలో స్థానిక కాకానిపాలెం జెడ్పీ హైస్కూల్‌లో శింగరకొండ గురుకుల పాఠశాలలో విద్యార్థులు మొక్కలు నాటారు. ఎంఈఓ బి. సుధాకరరావు పాల్గొన్నారు.

పర్చూరు (చినగంజాం): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాల్సిన అవసరం ఎంతైనా ఉందని పర్చూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ అన్నారు. శుక్రవారం కొల్లావారిపాలెం చెరువుగట్టుపై మొక్కలు నాటారు. కడియం నుంచి తెప్పించిన వివిధ రకాలకు చెందిన 50 రకాల మొక్కలను నాటినట్లు తెలిపారు. క్లబ్ కార్యదర్శి కోమటి ఆంజనేయులు, సభ్యులు సుబ్బారావు, నాగభైరు శ్రీనివాసరావు, ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

టెలిఫోన్ స్తంభం మార్చారోచ్!



స్తంభాన్ని మార్చుతున్న సిబ్బంది

కారంచేడు: 'కూలేందుకు సిద్ధంగా టెలీఫోన్ స్తంభం' అని సాక్షిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం కారంచేడు పెద్ద బజారు సెంటర్–చినవంతెన సెంటర్‌ల మధ్యన ఉన్న టెలిఫోన్ స్తంభంను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో పూర్తిగా వాలిపోయిన విషయం తెలిసిందే. వెంటనే స్పందించిన బీఎస్ఎన్ఎల్ సిబ్బందిని అభినందించారు.

కెనరా బ్యాంక్ Canara Bank

ఒంగోలు మెయిన్-II బ్రాంచ్, జి.ఎస్.టి. రోడ్డు, నెల్లూరు బస్టాండు ఎదురుగా, ఒంగోలు, ప్రకాశం జిల్లా. ఫోన్: 08592-233097, 9491304364

స్థిరాస్తులు అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూలు 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్, ఒంగోలు మెయిన్-II బ్రాంచ్ వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీతలు/హామీదారులు చెల్లించవలసిన బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్, ఒంగోలు మెయిన్-II బ్రాంచ్ అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతిక స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/ఛార్జ్ చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను తేది 25.09.2024న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన యావన్మంది విక్రయించబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా దిగువ ఋణగ్రహీతలు/హామీదారులకు తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది & సమయం: 25.09.2024, ఉ॥ 11.30 గం.లకు

రిజర్వ్ ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (E-bkray) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ధరావత్తును RTGS/NEFT ద్వారా చలాన్‌లోని ఖాతా వివరములకు పొందుపరిచి జమచేయాలి.

1 ఋణగ్రహీత(లు): శ్రీ ముప్పు వెంకట రమణయ్య, తండ్రి: సింగయ్య మరియు హామీదారు: శ్రీ ముప్పు శ్రీనివాసులు, తండ్రి: సింగయ్య. తేది. 31.07.2024 నాటికి బకాయి మొత్తం: రూ.5,85,053/- + తదుపరి వడ్డీ, ఇతర ఛార్జీలు.

ఒకవేళ ఎన్‌కంబ్రెన్స్‌లు ఏమైనా ఉన్నచో వాటితో కలిపి స్థిరాస్తి వివరములు:

ప్రకాశం జిల్లా, కందుకూరు సబ్-రిజిస్ట్రేషన్ ఆఫీస్, కందుకూరు మున్సిపాలిటీ, కందుకూరు టౌన్, సర్వే నెం.761, వార్డు నెం.7, బ్లాక్ నెం.2, గోపాల్‌నగర్. 1298 చ॥అ॥లు లేదా 18 గాదీస్ 2 చ॥అ॥లు లేదా 144.2/9 చ॥గ॥లు స్థలం లేదా 120.588 చ॥మీ॥ల స్థలంలో డోర్ నెం. 7-2-117, అసెస్‌మెంట్ నెం. 1033010629 గల ఆర్‌సిసి బిల్డింగ్ –536 చ॥అ॥, బాత్‌రూమ్ – 60 చ॥అ॥లు. హద్దులు: తూర్పు: కాకు కొండయ్య స్థలానికి ఆనుకుని ఉన్న ఈ అస్తి సొంత ప్రహరీ గోడ – ఈ వైపుగా 21'6", దక్షిణం: ముప్పు శ్రీనివాసులు యొక్క ఇల్లు మరియు స్థలం – ఈ వైపుగా 59', పడమర: 9' వెడల్పు బజారుకు ఆనుకొని ఉన్న ఈ అస్తి సొంత ప్రహరీ గోడ – ఈ వైపుగా 21' 9", ఉత్తరం: సెల్లర్స్ యొక్క మిగతా ఇల్లు మరియు స్థలంను ఆనుకొని ఉన్న ఈ అస్తి సొంత ప్రహరీ గోడ– ఈ వైపుగా 59'.

రిజర్వు ధర: రూ. 22,50,000/- ధరావత్తు సొమ్ము: రూ. 2,25,000/-

2 ఋణగ్రహీత: శ్రీ చల్లా హరినారాయణ, తండ్రి: చిన వెంకయ్య మరియు హామీదారు: శ్రీ మోరబోయిన వెంకయ్య, తండ్రి: సుబ్బయ్య. తేది. 31.07.2024 నాటికి బకాయి మొత్తం: రూ.23,68,768/- + తదుపరి వడ్డీ, ఇతర ఛార్జీలు.

ఒకవేళ ఎన్‌కంబ్రెన్స్‌లు ఏమైనా ఉన్నచో వాటితో కలిపి స్థిరాస్తి వివరములు:

ఆంధ్రప్రదేశ్ –523001, ప్రకాశం జిల్లా, ఒంగోలు, [illegible] పాలెం, ధరణ్ నగర్, వీధి నెం. C13, ప్రహరీ గోడ ఇంటి నెం. 116, రెండవ లైను, గోపాల్ నగర్ ఎక్స్‌టెన్షన్ ఏరియా (APOG-GNF-C13-116), ఆర్.ఎస్. నెం. 74, ప్లాట్ నెం. 9, అసెస్‌మెంట్ నెం. 1035037917, డి. నెం. 1-77(1/1), రెసిడెన్షియల్ జి+3 బిల్డింగ్, హద్దులు: ఉత్తరం: యలగల గంగయ్య అస్తి– 22'6", దక్షిణం: రెడ్డిబోయిన ప్రసాదరావు–22'6", తూర్పు: పెరుగు రమణమ్మ అస్తి –30 అ॥, పడమర: [illegible] వెంకటేశ్వర్లు అస్తి –30 అ॥.

రిజర్వు ధర: రూ. 45,00,000/- ధరావత్తు సొమ్ము: రూ. 4,50,000/-

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, ఒంగోలు మెయిన్–II బ్రాంచ్, మేనేజర్ గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 9491304364

ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్(Ebkray), వెబ్‌పోర్టల్ https://ebkray.in, హెల్ప్‌డెస్క్: 7046612345/6354910172/8291220220/9892219848/8160205051, ఇ-మెయిల్: support.ebkray@psballiance.com/ support.ebkray@procure247.com

తేది: 22.08.2024, ప్రదేశం: ఒంగోలు సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్